సాక్షి ములుగు

మంగళవారం | 4 | ఫిబ్రవరి | 2025



యుద్ధ ప్రాతిపదికన పనులు..

మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

- 8లో▸



పంటక్షేత్రాల్లో పసిప్రాయం

ఎన్ని చట్టాలు వచ్చినా..బాలల జీవితాలు మారడం లేదు. పాఠశాలకు వెళ్లాల్సిన చిన్నారులు.. మిర్చితోటల్లో కూలీ పనులు చేస్తున్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.2⁰ /10.2⁰

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ కాస్త చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం నేషనల్ హెల్త్ స్కీమ్ కేంద్ర వైద్యాధికారుల బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా వైద్యశాలలో సిబ్బంది వివరాలతో పాటు నేషనల్ స్కీమ్స్ అమలు తీరుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీకి అప్‌గ్రేడ్ కావడంతో వైద్యశాలలో తగిన భవనాలు, సిబ్బంది, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వైద్యబృందం సభ్యులు మురిగేషన్, సెంథిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ములుగు రూరల్: వసంత పంచమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు సోమవారం ప్రేమ్‌నగర్ షిరిడి సాయి బాబా ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు, సాయి ఉపాసకులు ఆకుల రజినీ–ప్రవీణ్‌కుమార్, ఆకుల జితేంద్ర సాయిల ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయి బాబను దర్శించుకున్నారు.

ఆరుగురిపై కేసు

కన్నాయిగూడెం: కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై వెంకటేష్ కథనం ప్రకారం ..మండల పరిధిలోని ఐలాపూర్‌లో కోడి పందేల స్థావరంపై సోమవారం సిబ్బందితో దాడి చేశాం. ఈ క్రమంలో కోడి పందేలు ఆడుతున్న వారు కోడి పుంజులు, బైక్‌లు వదిలి పారిపోయారు. ఈ మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నా



వెంకటాపురం(కె): మండల పరిధిలోని బోదాపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు ధర్నాకు దిగారు. ఖాళీ బిందెలు రోడ్డుకు అడ్డంగా పెట్టి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజుల కిందట మంచినీటి ట్యాంక్ మోటర్ మరమ్మతులకు గురికావడంతో నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మోటర్ మరమ్మతులు చేయించాలని పంచాయతీ, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

కనులపండువగా చెన్నకేశవ స్వామి కల్యాణం

కాటారం: మండలంలోని చింతకాని చెన్నకేశవ స్వామి ఆలయంలో భూనీళాసహిత చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవ వేడుక సోమవారం కనులపండువగా సాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు వేదమంత్రోచ్చరణల నడుమ స్వామి వారి కల్యాణం జరిపించారు. ప్రతీ ఏడాది ఆలయంలో కల్యాణం అంగరంగ వైభవంగా కొనసాగించడం ఆనవాయితీగా వస్తుంది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించి తరించారు.

నైన గుహల సందర్శన



మల్హర్: మల్హర్ మండలం కొయ్యూర్ పీవీనగర్ అడవి సోమన్‌పల్లి వంతెన సమీపంలోని జైన గుహలు (నైన గుహలను) ఏకశిలా గుహలను అధ్యయనం చేయడానికి ఫ్రాన్స్ పర్యటకురాలు, చరిత్ర పరిశోధకురాలు సోలెన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఒకే రాతిలో నిర్మించబడిన గుహల శిల్ప సౌందర్యం, భారతీయ రాతి కట్టడ నిర్మాణ శైలిని సోలెన్ అభినందించారు. గుహ లోపల చెక్కుచెదరకుండా ఉన్న చిత్రాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలనాటి చిత్ర కళను తమ కెమెరాల్లో బంధించారు.



- ఈపక్క చిత్రంలో కనిపిస్తున్న దంపతుల పేర్లు రవి, స్వరూప. చేతిలో పాపతో ఆనందంగా కనిపిస్తున్న వీరిది స్టేషన్‌ఘన్‌పూర్. పెళ్లయిన కొన్నేళ్లకు రవికి ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చింది. విషయం తెలియగానే రవి స్వరూప దంపతులు మాతృత్వానికి నోచుకోమని కుమిలిపోయారు. అధునాతన సాంకేతికతతో సంతానం పొందవచ్చని తెలుసుకుని ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆశ్రయించారు. ముందుగా రవి స్పెర్మ్, స్వరూప అండాలను భద్రపర్చారు. అనంతరం రవి కీమోథెరపీ చేయించుకున్నాడు. ఆతర్వాత వారు ఐవీఎఫ్ ద్వారా పాపకు జన్మనిచ్చారు. ఇప్పుడు 8 నెలల పండంటి పాపతో ఆదంపతులు మాతృత్వపు అనుభూతిని ఆస్వాదిస్తున్నారు. క్యాన్సర్‌ను సైతం జయించి మాతృత్వాన్ని పొందారు.
- మహబూబాబాద్‌కు చెందిన రాజేశ్, సునీత దంపతులకు ఐదేళ్ల కిందట వివాహమైంది. రెండేళ్ల క్రితం అతడికి వృషణ క్యాన్సర్‌గా నిర్ధారణ అయ్యింది. చిన్న వయస్సులోనే క్యాన్సర్ రావడంతో తల్లిదండ్రులయ్యే అవకాశం లేదంటూ.. మానసికంగా కుమిలిపోయారు. టీవీల్లో, సామాజిక మాధ్యమాల్లో చూసి హనుమకొండలోని ఓ ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆశ్రయించారు. రాజేశ్ కీమో థెరపీకి వెళ్లే ముందు స్పెర్మ్, సునీత అండాలను భద్రపర్చారు. ఆ తర్వాత ఐవీఎఫ్ ద్వారా వారికి ప్రస్తుతం పాప జన్మించింది. క్యాన్సర్ ఉన్నప్పటికీ తల్లిదండ్రులు కావడంతో వారి సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి.

..ఇలా క్యాన్సర్ ఉన్నప్పటికీ అనేక మంది ఐవీఎఫ్ ద్వారా తల్లిదండ్రులవుతున్నారు. వైద్యంతో వ్యాధిని నయం చేసుకుంటున్నారు. సాధారణ జీవితం గడుపుతున్నారు. నేడు (మంగళవారం) ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా మాతృత్వపు మాధుర్యాన్ని పొందుతున్న వారిపై 'సాక్షి'ప్రత్యేక కథనం.

క్యాన్సర్‌ను జయించి.. మాతృత్వం వరించి



బాధితుల్లో సంతాన ఫలాలు


- హద్దుల్లేని ఆనందంలో దంపతులు
- మొదటి దశలో గుర్తిస్తే తొందరగా నయమవుతుందంటున్న వైద్యులు

నేడు ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం

హన్మకొండ చౌరస్తా: క్యాన్సర్ మహమ్మారి ఏటా లక్షలాది మందిని పొట్టనబెట్టుకుంటోంది. వయస్సు, లింగబేధం తేడా లేకుండా అందరినీ వెంటాడుతోంది. ఒక్కొక్కరికి ఒక్కో భాగంలో మొదలై విస్తరిస్తోంది. జీవన శైలిలో మార్పులు, చెడు అలవాట్లు, జన్యుపరమైన కారణాల వల్ల క్యాన్సర్ వ్యాధి సంక్రమిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యాధిని ఆదిలోనే గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం భారీ మూల్యమే చెల్లించాల్సి ఉంటుంది. ఒకటి రెండు స్టేజీలు దాటితే మాత్రం సర్జరీల దాకా వెళ్లాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల నిర్వహించిన అసంక్రమిత వ్యాధుల సర్వేలో ఉమ్మడి జిల్లాలో పలువురు వివిధ రకాల క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు.

కారణాలెన్నో..

సిగరెట్ తాగి ఒకరు క్యాన్సర్ బారిన పడితే.. మద్యం సేవించి మరొకరు. కలుషిత ఆహారం తీసుకొని ఒకరు మహమ్మారి బారిన పడితే.. పొగాకు, గుట్కా, పాన్ మసాలాలు తిని ఇంకొకరు ఇలా కారణాలేవైనా ప్రమాదం పొంచే ఉంది. ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ క్యాన్సర్ వచ్చిన వాళ్లు ఉన్నారు. కలుషిత, రసాయనాల పంటలు, పండ్లు తిని జబ్బు పడిన వారూ ఉన్నారు.



సంతానోత్పత్తికి ఆందోళన చెందొద్దు



దంపతుల్లో ఎవరికైనా క్యాన్సర్ ఉందని నిర్ధారణ అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ ద్వారా మాతృత్వపు అనుభూతిని వారు పొందొచ్చు. అయితే కీమో, రేడియేషన్ థెరపీలు చేయించినట్లయితే మగ వారిలో స్పెర్మ్ చురుకుదనం, ఆడవారిలో అండ ఫలదీకరణ మందగిస్తుంది. అందుకే థెరపీకి వెళ్లే ముందు స్పెర్మ్, ఎగ్స్‌లను స్టోర్ చేస్తాం. వారికి థెరపీ పూర్తయ్యాక అత్యాధునిక టెక్నాలజీలో ఐవీఎఫ్ ద్వారా సంతాన సాఫల్యాన్ని అందిస్తాం.

- డాక్టర్ కావ్యరావు జలగం, రీజనల్ మెడికల్ హెడ్, ఓయాసిస్ ఫెర్టిలిటీ, హనుమకొండ

జిల్లాల వారీగా క్యాన్సర్ బాధితులు ఇలా..

జిల్లా	ఓరల్	బ్రెస్ట్	సర్వైకల్	ఇతరులు
హనుమకొండ	83	215	111	189
వరంగల్	235	192	125	-
జనగామ	31	79	97	137
ములుగు	21	08	30	-

ఆనందంగా ఉన్నాం..

నాకు మూడేళ్ల క్రితం పెళ్లయ్యింది. అనంతరం బ్రెస్ట్ క్యాన్సర్ ఉన్నట్లుగా తెలిసింది. మొదట భయం వేసింది. కీమో థెరపీ తప్పనిసరి కావడంతో ముందుగా ఫెర్టిలిటీ సెంటర్‌లో నా అండాన్ని నిల్వ చేశారు. ఇప్పుడు బాబుకు జన్మనిచ్చా. మాతృత్వపు ఫలాన్ని అందుకుని మేం ఆనందంగా ఉంటున్నాం.

- మీనా, హనుమకొండ

మొదట ఆందోళన చెందా..

మాకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. మూడేళ్ల నుంచి పిల్లల కోసం ప్రయత్నిస్తున్నాం. నాకు క్యాన్సర్ అని నిర్ధారణ కావడంతో మొదట తీవ్ర ఆందోళన చెందా. అనంతరం ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆశ్రయించాం. కీమో థెరపీకి వెళ్లే ముందు నా స్పెర్మ్‌ను భద్రపర్చి, ఆ తర్వాత ఐవీఎఫ్ ద్వారా సంతాన సాఫల్యం పొందాం. ఇప్పుడు మాకు ఏడాది బాబు ఉన్నాడు. చాలా ఆనందంగా ఉన్నాం.

- విజయ్, హనుమకొండ

మొదటి దశలో గుర్తిస్తే నయం చేయొచ్చు



కళ్లు, లివర్ ఫంక్షన్లలో వచ్చే మార్పుల ఆధారంగా స్క్రీనింగ్ చేసి క్యాన్సర్‌ను నిర్ధారించవచ్చు. మొదటి దశలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నయం చేయవచ్చు. ఒకటి, రెండు స్టేజీలు దాటితే మాత్రం క్యాన్సర్ సోకిన భాగాన్ని సర్జరీ చేసి తొలగించాల్సి వస్తుంది. మూడో స్టేజీలో కీమో, రేడియేషన్ థెరపీల ద్వారా చికిత్స అందించవచ్చు. ఇప్పుడు థెరపీ చికిత్స ఎంజీఎం ఆస్పత్రిలో అందుబాటులో ఉంది. జిల్లాలో ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి బాధితులను గుర్తిస్తున్నాం.

- డాక్టర్ అప్పయ్య, డీఎంహెచ్‌ఓ, హనుమకొండ

యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ టీఎస్.దివాకర



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు: యువత ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర తెలిపారు. జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజనల్ సెంటర్ కార్యాలయంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులలో డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు శిక్షణా తరగతులను కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతలో నైపుణ్యాలు పెంపొందించడానికి టాస్క్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నారని తెలిపారు. టెక్నికల్ శిక్షణలో భాగంగా జావా ప్రోగ్రామింగ్, వెబ్ డెవలప్‌మెంట్, పైథాన్ ప్రోగ్రామింగ్, డేటాబేస్ అప్లికేషన్స్, సి ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, సూడో కోడ్, ఫుల్ స్టాక్ అప్లికేషన్స్ మొదలగు కోర్స్‌లలో ఉద్యోగ మెలకువలు నేర్పిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే బ్యాంకింగ్ పోటీ పరీక్షలకు సైతం శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 9618449360లో సంప్రదించాలని కోరారు.

అడవికి నిప్పు పెట్టొద్దు

- కలెక్టర్ టీఎస్.దివాకర



ప్రజలకు సూచనలిస్తున్న నాగమణి

వాజేడు: అడవికి నిప్పు పెట్టవద్దని కోరుతూ సోమవారం మండల పరిధిలోని పెనుగోలు కాలనీ గ్రామంలో అటవీ శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ నాగమణి మాట్లాడుతూ ఇప్ప పువ్వులు, చీపురు సేకరించడానికి అడవి వెళ్లిన ప్రజలు చెట్లకింద కూర్చొని నిప్పు పెడితే అడవిలో మంటలు చెలరేగి అడవికి నష్టం వాటిల్లుతుందన్నారు. తునికాకు పొదలకు నిప్పు పెట్టవద్దని, ప్రూనింగ్ చేస్తేనే ఎక్కువగా ఆకులు వస్తాయని వివరించారు. అడవిలో నిప్పు మూలంగా వన్య ప్రాణులు ఆశ్రయం కోల్పోయి ఇబ్బందులు పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టర్ ముద్ర లేకుండా..
సస్పెన్షన్ లెటర్?

- సీడీపీఓను సస్పెండ్ చేస్తూ విడుదలైన ఉత్తర్వులు
- సోషల్ మీడియాలో హల్‌చల్

ములుగు: జిల్లాలోని అన్ని శాఖలకు కలెక్టర్ బాస్ అనేది అందరికీ తెలిసిందే. ఆయన ఆదేశాలను ఎవరైనా పాటించాల్సిందే. అలాంటిది ములుగు జిల్లాలో కలెక్టర్ స్టాంప్ లేకుండా వెంకటాపురం(కె) అంగన్‌వాడీ ప్రాజెక్టు సీడీపీఓను సస్పెండ్ చేస్తూ విడుదలైన లెటర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. సంక్షేమ శాఖ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ నేరుగా నిర్ణయం తీసుకొని చర్యలు తీసుకునే అవకాశం ఉండగా సీడీపీఓ ధనలక్ష్మిని సస్పెండ్ చేస్తూ వచ్చిన ఉత్తర్వు లెటర్‌లో కేవలం కలెక్టర్ పేరు మాత్రమే ఉండగా కింద ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ స్టాంప్ ఉండడం విశేషం. జిల్లా బాస్‌గా ప్రతీ విషయంపై స్పందించాల్సిన కలెక్టర్ ఈ విషయమై పలుమార్లు ఫోన్‌లో మాట్లాడడానికి ప్రయత్నించగా సాక్షికి అందుబాటులోకి రాలేదు. అయితే గత కొన్ని రోజులుగా కలెక్టర్ విలేకరుల విషయంలో స్పందించకుండా నడుచుకుంటున్నారని తెలుస్తోంది. ఇదే విషయమై సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ ఝాన్సీని వివరణ కోరగా ప్రస్తుతం సెలవులో ఉన్నానని విధుల్లోకి చేరిన అనంతరం జిల్లాలో జరుగుతున్న తతంగంపై ఆరా తీసి రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని వెల్లడించారు. అయితే పత్రికలో వచ్చిన వార్తను చూశానని ఆకోణంలోనూ విచారణ చేపడుతానని వివరించారు.

- జిల్లాలోని సంక్షేమ శాఖలో డీడబ్ల్యూఓ, వెంకటాపురం(కె) సీడీపీఓ మధ్యలో సాగుతున్న అంతర్గత పోరు వ్యవహారంపై సోమవారం డీడబ్ల్యూఓ వర్సెస్ సీడీపీఓ పేరుతో సాక్షిలో కథనం వెలువడిన విషయం తెలిసిందే.. దీంతో ఈ విషయం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇకముందు మరిన్ని కథనాలు వచ్చే అవకాశం ఉందని తెలిసిన సంబంధిత జిల్లా ఉన్నతాధికారి సస్పెషన్ విషయాన్ని తెరపైకి తీసుకొచ్చినట్లుగా తెలుస్తోంది. పైగా ప్రస్తుత డీడబ్ల్యూఓ విషయంలో ఏకంగా మంత్రి సీతక్కను లాగడం మరో ఆసక్తికరమైన అంశం.



కలెక్టర్ ముద్రలేని సస్పెన్షన్ లెటర్

- డీడబ్ల్యూఓ, సీడీపీఓలకు మధ్య తలెత్తిన ఈ తగాదా అంతా వెంకటాపురం(కె) ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్ల నుంచి మొదలైనట్లుగా తెలుస్తోంది. వెంకటాపురం(కె) ప్రాజెక్టు పరిధిలో 2018లో ప్రస్తుత డీడబ్ల్యూఓ శిరీష సీడీపీఓగా జాయిన్ అయ్యారు. అప్పటి నుంచి అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో సంబంధాలు బాగా పెంచుకున్నారు. తదనంతరం మూడు నెలల క్రితం ధనలక్ష్మీ సీడీపీఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రాజెక్టు పరిధిలో కొన్ని ఆరోపణలు వచ్చాయి.

ఆరోపణలు ఇలా..

జిల్లా కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌కు చర్చి తరఫున భవనాన్ని కేటాయించినా స్థానిక అంగన్‌వాడీ టీచర్ భర్త పేరుపై అద్దె తీసుకుంటున్నారు. శాంతినగర్‌లో సెంటర్ లేదు.. అంతకుముందు విధులు నిర్వహించిన అంగన్వాడీ టీచర్ కొడుకు పేరుమీద నెలకు రూ.1,350 తీసుకుంటున్నారు. పర్సికగూడెంలో సెంటర్ లేదు.. కానీ అంగన్వాడీ టీచర్ తమ బంధువుల పేరుపై రూ.750 రెంట్ తీసుకుంటున్నారు. ఎదిర–1 అంగన్ వాడీ సెంటర్ స్కూల్ ఆవరణలో నడుస్తోంది. కానీ అంగన్ వాడీ టీచర్ పేరుమీద రెంట్ వస్తోంది. రంగరాజపురంలో సెంటర్ పాఠశాలలో ఉంది కానీ అంగన్ వాడీ టీచర్‌కు సంబంధించిన బంధువు పేరుపై రెంట్ వస్తోంది. సాధారణంగా టీచర్ పోస్టు ఖాళీగా ఉంటే అర్హత ప్రకారం ఆయాకి ఆ పోస్టును కేటాయించడానికి అవకాశం ఉంటుంది. కానీ ఎస్సీ మద్రిగూడెంలోని ఆయాను బీసీ మద్రిగూడెంకు చెందిన సెంటర్ టీచర్‌గా నియమించారు. మద్రిగూడెంలోని ఆయాకు ఆ అవకాశం ఇవ్వలేదు. బోధాపురం–1 సెంటర్‌లో రిటైర్డ్ అయిన ఆయాకు ఎందుకు జీతం చేస్తున్నారని సీడీపీఓ ప్రశ్నిస్తే నీకు సంబంధం లేదని డీడబ్ల్యూఓ చెప్పినట్లు..ఇలాంటి ఆరోపణలు బహిర్గంతంగా వస్తున్నాయి. ఇలాంటి విషయంపై కలెక్టర్ ఏక దృష్టిలో నిర్ణయం ఎలా తీసుకున్నారో అర్థం కావడం లేదని సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై సీనియర్ సీడీపీఓలు, అంగన్ వాడీ సూపర్‌వైజర్లు నేరుగా కమిషనర్‌ను కలిసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది.

కమల సారథులు..

ఐదు జిల్లాలకు అధ్యక్షుల నియామకం..
మహబూబాబాద్‌పై సస్పెన్స్

- ముగ్గురికి రెండోసారి, ఇద్దరికి మొదటిసారి అవకాశం
- పలువురు సీనియర్ నేతలకు రాష్ట్ర కౌన్సిల్‌లో చోటు
- స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ఎట్టకేలకు నియామకం
- మూడు జిల్లాల్లో అధ్యక్షుల ఎంపికపై అసంతృప్తి?

సాక్షి ప్రతినిధి, వరంగల్:

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై భారతీయ జనతా పార్టీ దృష్టి సారించింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే ముందే సంస్థాగత కమిటీలను పటిష్టం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మూడు నెలలుగా రేపు, మాపు అంటూ వాయిదా పడుతున్న జిల్లా అధ్యక్షుల ఎంపికపై క్లారిటీ ఇచ్చింది. హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన అధిష్టానం.. కొద్దిరోజులుగా ఉన్న సస్పెన్స్‌కు సోమవారం తెరదించింది. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడి నియామకం విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. అలాగే ఐదు జిల్లాలనుంచి 10 మంది సీనియర్లకు రాష్ట్ర కౌన్సిల్‌లో సభ్యులుగా అవకాశం కల్పించారు.

రాష్ట్ర కౌన్సిల్‌లో వీరికే స్థానం...

బీజేపీ పార్టీ సీనియర్‌లు, ఇతర పదవులు ఆశించిన కొందరిని పార్టీ అధిష్టానం రాష్ట్ర కౌన్సిల్‌లో స్థానం కల్పించింది. జిల్లా అధ్యక్షులతోపాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాతిపదికన కమిటీల్లో నియమించారు. హనుమకొండ జిల్లా పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలనుంచి గట్టుకొప్పుల రాంబాబు, రావుల సుదర్శన్‌లను రాష్ట్ర కౌన్సి ల్ సభ్యులుగా పార్టీ అధిష్టానం నియమించింది. అదే విధంగా వరంగల్ జిల్లా నుంచి వడ్డెపల్లి నర్సింహులు, తాబేటి వెంకట్ గౌడ్, మరిపెల్లి రాంచంద్రా రెడ్డి, భూపాలపల్లి నుంచి రాయరాకుల మొగిలి, జనగామ నుంచి మహేందర్‌రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, రచ్చకుమార్, ములుగు నుంచి భూక్యా జవహర్‌లాల్‌కు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఛాన్స్ ఇచ్చారు.

ఆశావహుల అసంతృప్తి.. మానుకోటలో పోటాపోటీ..

బీజేపీ నూతన జిల్లా కమిటీ, రాష్ట్ర కౌన్సిల్‌లో అవకాశం దక్కని కొందరు సీనియర్ నేతలను అధిష్టానం నిర్ణయం అసంతృప్తికి గురిచేసింది.

ములుగు జిల్లా అధ్యక్షుడిగా బలరామ్



జిల్లా అధ్యక్షుడు బలరామ్



రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహర్‌లాల్

ములుగు రూరల్: బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడిగా సిరికొండ బలరామ్ ను నియమించినట్లు ఆ పార్టీ నాయకులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధ్యక్షుడు బలరామ్‌కు నియామక పత్రం వాట్సాప్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియామకం కావడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐదు జిల్లాల అధ్యక్షులు వీరే..

బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం 27 జిల్లాలకు నూతన అధ్యక్షులను ప్రకటించిన ఆ పార్టీ అధిష్టానం.. ఉమ్మడి వరంగల్‌లో ఐదు జిల్లాల సారథులను ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పార్టీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన వాళ్లకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో పాటు వాట్సాప్ ద్వారా నియామక పత్రాలను పంపారు. హనుమకొండ జిల్లా అధ్యక్షురాలుగా రావు పద్మ మూడుసార్లు, జనగామ అధ్యక్షుడిగా ఆరుట్ల దశమంతరెడ్డి రెండుసార్లు పనిచేయగా.. తాజాగా వారి స్థానంలో హనుమకొండ అధ్యక్షుడిగా కొలను సంతోష్‌రెడ్డి, జనగామ నుంచి సౌడ రమేష్‌లకు మొదటిసారి అవకాశం కల్పించారు. వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల అధ్యక్షులుగా ఉన్న గంట రవికుమార్, ఏడునూతల నిశిధర్ రెడ్డి, సిరికొండ బలరామ్‌లకు అధిష్టానం రెండోసారి అవకాశం ఇచ్చింది.

హనుమకొండ జిల్లా సారథిగా మూడు పర్యాయాలు పనిచేసిన నాయకురాలి సూచనలకే అధిష్టానం ఓకే చెప్పడం.. అదే సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి జిల్లా పగ్గాలు అప్పగించారన్న చర్చ ఇతర వర్గాల్లో సాగుతోంది. కొందరు ఈ విషయమై సమావేశం కావడం కూడా చర్చనీయాంశంగా మారింది. ములుగు నుంచి చింతలపూడి భాస్కర్ రెడ్డి, భూక్యా జవహర్‌లాల్ తదితరులు ఆశించినప్పటికీ రెండోసారి బలరామ్‌కే ఛాన్స్ ఇవ్వడం నిరాశపర్చింది. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న యలమంచిలి వెంకటేశ్వర్ రావు మళ్లీ తానే కొనసాగాలనే ఆసక్తితో ఉండగా.. వల్లభనేని వెంకటేశ్వర్లు, కాపరబోయిన సత్యనారాయణ, మాధవపెద్ది శశివర్ధన్ రెడ్డి తదితరులు గట్టిగా పోటీ పడుతుండటంతో అధిష్టానం ఇంకా ఎటూ తేల్చలేదు. మరో జిల్లాలో కూడా చాపకింది నీరులా ఉన్న అసంతృప్తితో ఉన్న ఆశావహనేతలకు సీనియర్లు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.

బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్



మాట్లాడుతున్న అశోక్

ములుగు: బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసిన బీజేపీని రాష్ట్ర ప్రజలు వచ్చే ఎన్నికల్లో నామరూపాలు లేకుండా చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌తో కలిసి మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. గిరిజన యూనివర్సిటీకి 211ఎకరాల భూమిని అప్పగించినప్పటికీ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. రోడ్లు, భవనాలు, నీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ గౌడ్, చాంద్ పాషా, రవియాదవ్, రేగ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

బస్సులోనే ఆగిన గుండె..

గుండెపోటుతో మహిళ మృతి


శంకరమ్మ (ఫైల్)

తాడ్వాయి : వైద్య సేవల కోసం ఆస్పత్రికి వెళ్తుండగా ఓ మహిళ బస్సులోనే గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మండలంలోని వెంగళాపూర్‌లో చోటు చేసుకుంది. మండలంలోని నార్లాపూర్‌కు చెందిన పల్లప్పు శంకరమ్మ(56)కు ఛాతీలో నొప్పి రావడంతో వైద్య సేవల నిమిత్తం ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ఈ క్రమంలో బస్సు వెంగళాపూర్ సమీపానికి చేరుకోగానే నొప్పి ఎక్కువ కావడంతో శంకరమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. దీనిని ప్రయాణికులు గమనించి కండక్టర్‌కు చెప్పారు. బస్సు నిలిపి మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు శాంతమ్మ మృతదేహాన్ని నార్లాపూర్‌కు తీసుకెళ్లారు.

మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కు మాతృవియోగం


వెంకటమ్మ (ఫైల్)

జఫర్‌గఢ్: వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు అరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ(95) అనారోగ్యంతో సోమవారం స్వగ్రామం ఉప్పుగల్లులో మృతి చెందింది. కాగా, పలువురు ఉప్పుగల్లుకు చేరుకుని రమేశ్‌ను పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు జంగా రాఘవరెడ్డి, మార్నేని రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, బీజేపీ నేతలు మార్తినేని ధర్మారావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మంచాల కుమారస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు కొరుకొప్పుల నాగేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు. కాగా, వెంకటమ్మ అంత్యక్రియలు మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైల్వే కోచ్ రెస్టారెంట్ ప్రారంభం



ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో అలంకారంగా ఏర్పాటు చేసిన రైలు కోచ్‌ను రెస్టారెంట్‌గా మార్చారు. సోమవారం ప్రారంభించారు. రైలు కోచ్‌లో కూర్చుని టిఫిన్ చేసే అనుభూతి కలిగేలా ఈ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, జీఆర్పీఎఫ్, ఆర్పీఎఫ్ అధికారులు, పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు..


జంపన్నవాగులో స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేస్తున్న బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్


కన్నెపల్లిలోని సారలమ్మ గుడి స్లాబ్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

- మినీ జాతరకు వారమే గడువు
- చకచకా కొనసాగుతున్న పనులు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతర పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే మినీ జాతర (మండమెలిగె)కు ఇంకా వారం రోజుల సమయమే మిగిలి ఉంది. దీంతో పనులు చకచకా కొనసాగుతున్నాయి. కాగా, ఈనెల 3వ తేదీ వరకు మేడారం మినీ జాతర పనుల పూర్తికి రాష్ట్ర మంత్రి సీతక్క డెడ్‌లైన్ విధించారు. దీంతో ఆయా శాఖల అధికారులు సోమవారం ఏర్పాట్లను పరిశీలించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

తల్లుల గద్దెల ప్రాంగణంలో విద్యుత్ వెలుగుల కోసం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. గద్దె చుట్టూ సాలహారంపై , గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నారు. నేటి (మంగళవారం)తో విద్యుదీకరణ పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సారలమ్మ గుడి స్లాబ్‌పై మరమ్మతులు

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిపై పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించి మరమ్మతులు చేపట్టారు. గుడి భవనంపై చెట్టు కొమ్మలు విరిగి ప డినట్లు వదంతులు వచ్చాయి. పూజారులు మాత్రం అలాంటిది ఏమి జరగలేదని, స్లాబ్ పై పిచ్చిమొక్కలు తొలగించి సిమెంట్‌తో మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఈఓ రాజేంద్రంను వివరణ కోరగా చెట్టు కొమ్మలు విరిగి ఆలయ స్లాబ్ పై పడినట్లు వస్తున్న వదంతులను నమ్మొద్దన్నారు.

ఇసుక దిబ్బలను తలపిస్తున్న జంపన్నవాగు..

మేడారం జాతర సందర్భంగా భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అయితే వాగు ప్రస్తుతం చుక్క నీరు లేకుండా ఎండిపోయి ఇసుక దిబ్బలను తలపిస్తోంది. దీంతో ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరుగనున్న మినీ జాతరకు అధికారులు నీటి ఏర్పాట్లు చేస్తున్నారు. 2023లో జరిగిన మినీ జాతర సమయంలో వాగులో కొంత మేర నిల్వ నీరు ఉంది. ఈ సారి జాతరకు మాత్రం చుక్క నీరు కనిపించడం లేదు. దీంతో ఇరిగేషన్ అధికారులు జంపన్నవాగు స్నాన ఘట్టాలపై షవర్లు ఏర్పాటు చేసి భక్తులు జల్లు స్నానాలు చేసేలా పనులు చేపడుతున్నారు. కాగా, పగిడాపూర్ చెక్ డ్యాం, లక్నవరం నుంచి కొంత నీటి విడుదల చేస్తే భక్తులు వాగులోనే పుణ్యస్నానాలు చేసే వీలుంటుందని పూజారుల అభిప్రాయ పడుతున్నారు.


మేడారం సాలహారంపై హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రీషియన్

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

- టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి


కరపత్రాలు అందజేస్తూ ప్రచారం చేస్తున్న శ్రీపాల్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : తాను వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ నుంచి ఎన్నికల బరిలో ఉండబోతున్నానని, తనను గెలిపిస్తే ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ, జువాలజీ, బయోటెక్నాలజీ, మహిళా ఇంజనీరింగ్ కళాశాల, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాలను సందర్శించి ఆయా అధ్యాపకులతో మాట్లాడారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ రామచంద్రంను కలిసి అభినందించారు. తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జనరల్‌సెక్రటరీ ఫలితశ్రీహరి, బాధ్యులు ఉపేందర్‌రెడ్డి, యాకూబ్, డాక్టర్ కుందూరు సుధాకర్, కిరణ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీటు కోసం సిగపట్లు..!


కాళేశ్వరం బస్టాండ్‌లో కొట్లాడుతున్న మహిళలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులో సీటు కోసం ఇద్దరు మహిళలు సిగ(జుట్టు)లు పట్టుకొని బాహాబాహీకి దిగారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఆర్టీసీ బస్సు కోసం వేచి చూశారు. బస్సు రావడంతో ఓ మహిళ సీటులో చేతి రూమాలు వేసింది. మరో మహిళ ఆ చేతి రూమాలు తీసి కూర్చుంది. దీంతో నా సీటు అంటూ ఇద్దరు మహిళలు బస్సు దిగి బస్టాండ్ ప్రాంగణంలో సిగలు పట్టుకొని తిట్ల దండకం చదువుతూ కొట్లాటకు దిగారు. చుట్టూ ఉన్న వారి కుటుంబ సభ్యులు ఆ ఇద్దని విడదీయడానికి నానా తంటాలు పడ్డారు. ఈ వీడియోను స్థానికులు సోమవారం ఉదయం నుంచి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మహాలక్ష్మి పథకంతోనే బస్సుల్లో మహిళల గొడవలు నిత్యకృత్యంగా మారిందని చర్చించుకోవడం గమనార్హం.

పగిడిద్దరాజు ఆలయంలో

అభివృద్ధి పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గంగారం: మేడారం సమ్మక్క, సారలమ్మ మినీజాతర అభివృద్ధి పనుల్లో భాగంగా పూనుగొండ్ల పగిడిద్దరాజు ఆలయానికి నిధులు మంజూరయ్యాయి. ఈనేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు.. పగిడిద్దరాజు ఆలయంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. మంత్రి సీతక్క కృషితో గంగారం మండలం పూనుగొండ్ల గ్రామంలోని పగిడ్డిరాజు ఆలయానికి నిధులు మంజూరయ్యారని, ఆ పనులను త్వరితగతిన పూర్తి చేసి జాతరను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు, మాజీ జెడ్పీటీసీ ఈసం రమాసురేశ్, మాజీ ఎంపీపీ ముడిగ వీరభద్రపోతయ్య, ప్రధాన కార్యదర్శి కొమురయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పెనుక పురుషోత్తం, మండల యూత్ అధ్యక్షుడు ముడిగ విజయ శ్రీధర్, సారలక్ష్మి, కాంతారావు, సురేందర్, నర్సింహారావు, లక్ష్మీనర్సు, సమ్మయ్య, వెంకన్న, సుధాకర్, రాహుల్, ఆదినారాయణ, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ పేలి మూడు ఇళ్లు దగ్ధం

- కాలిపోయిన ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముల ఇళ్లు
- రూ.55 లక్షల ఆస్తి నష్టం
- ఇప్పగూడెంలో ఘటన
- మిన్నంటిన బాధితుల రోదనలు


దగ్ధమైన ఇళ్ల వద్ద బాధితులు


బ్యాగులో ఉన్న డబ్బులు, పత్రాలు దగ్ధమయ్యాయని చూపుతున్న బాధితులు మల్లయ్య దంపతులు

స్టేషన్‌ఘన్‌పూర్: వంటగ్యాస్ సిలిండర్ పేలి మూడు పెంకుటిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఆయా ఇళ్లలోని వస్తువులు, నగదు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ ఘటన సోమవారం మండలంలోని ఇప్పగూడెంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తొడెంగల మల్లయ్య, కృష్ణమూర్తి, ఐలయ్య అన్నదమ్ములు. ముగ్గురు వ్యవసాయం చేసుకుంటూ తమ కుటుంబాలతో ఎంకమ్మగడ్డ సమీపంలో వరుసగా మూడు పెంకుటిళ్ల కట్టుకుని నివాసం ఉంటారు. ఈ క్రమంలో సోమవారం కృష్ణమూర్తి భార్య తన ఇంట్లో దేవుడికి దీపం వెలిగించింది. ఉదయం తమ ఇళ్లలో పనిముగించుకున్న మల్లయ్య-సరోజన, కృష్ణమూర్తి-భాగ్య, ఐలయ్య-రజిత దంపతులు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఈ క్రమంలో కృష్ణమూర్తి ఇంటిలోని వంటగ్యాస్ సిలిండర్ లీకై ఒక్కసారిగా పేలింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి వరుసగా ఉన్న మూడు ఇళ్లకు వ్యాపించాయి. గమనించిన చుట్టుపక్కల వారు బాధితులకు సమాచారం అందించడంతో పాటు నీళ్లు పోస్తూ మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే పెద్ద ఎత్తున వ్యాపించడంతో ఆర్పలేకపోయారు.

ఘటనా స్థలికి స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి ఫైరింజన్లు..

ఇప్పగూడెంలో ఇళ్లు దగ్ధమవుతున్న సమాచారం అందుకున్న స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తికి చెందిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పారు. అయితే అప్పటికే మూడు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఆయా ఇళ్లలో ఉన్న నగదు, బియ్యం, మంచాలు, ఫర్నిచర్, బీరువాలు, బంగారు ఆభరణాలు, టీవీలు, ఫ్యాన్లు, బాండ్ పేపర్లు, విలువైన పత్రాలు, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి.

రూ.55 లక్షల ఆస్తి నష్టం

ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. మొత్తం మూడు కుటుంబాలకు చెందిన రూ.55 లక్షల ఆస్తి నష్టం జరిగింది. కృష్ణమూర్తి ఇంట్లో రూ.10లక్షలు నగదు, అప్పు కాగితాలకు సంబంధించిన బాండ్ పేపర్లు, రూ.10లక్షల వస్తువులు, మల్లయ్య ఇంట్లో రూ.20 లక్షల విలువైన వస్తువులు, ఐలయ్య ఇంట్లో రూ.15 లక్షల విలువైన వస్తువులు కాలిబూడిదైనట్లు బాధితులు తెలిపారు. కళ్ల ముందే ఇళ్లు, వస్తువులు కాలిబూడిదై కనిపిస్తుండగా బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు.

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మందపురం ఎల్లగౌడ్, సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేశ్ వేర్వేరుగా ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాద వివరాలను కలెక్టర్‌కు పంపిస్తామని, బాధితులకు అండగా ఉంటామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు.

బిడ్డ పెళ్లి కోసం భూమి అమ్మగా వచ్చిన డబ్బులు కాలిపోయాయి..

నా కుమార్తె వివాహం కోసం 20 గుంటల భూమి అమ్మగా రూ.20 లక్షలు వచ్చాయని, అందులో రూ.10లక్షలు బీరువాలో పెట్టగా కాలిబూడిదయ్యాయని కృష్ణమూర్తి రోదిస్తూ తెలిపాడు. పెళ్లి కోసం బియ్యం, దుస్తులు, ఆభరణాలు తీసుకున్నామని, అన్నీ కాలిపోయాయని బాధిత దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తెలిపారు.

కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా వెంకయ్య..


వెంకయ్య


వరలక్ష్మి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీగా జువా లజీ విభాగం ప్రొఫెసర్ వై. వెంకయ్యను కొనసాగించబోతున్నారు. ఈ మేరకు వీసీ కె. ప్రతాప్‌రెడ్డి సోమవారం అప్రూవల్ చేశారు. దీంతో రిజిస్ట్రార్ వి. రామచంద్రం నేడు(మంగళవారం) ఉత్తర్వులు జారీచేయనున్నారు. స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీగా వెంకయ్య సంవత్సరం పాటు పదవిలో కొనసాగారు. గత నెల 29న పదవీ కాలం ముగిసింది. దీంతో వెంకయ్యను మరో సంవత్సరం పాటు స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీగా కొనసాగించబోతున్నారు.

కేయూ ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్‌గా వరలక్ష్మి..

కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ (దూరవిద్యకేంద్రం) డైరెక్టర్‌గా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్, సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. వరలక్ష్మిని నియమించబోతున్నారు. దూరవిద్యకేంద్రం డైరెక్టర్‌గా ఉన్న ప్రొఫెసర్ రామచంద్రం రిజిస్ట్రార్‌గా నియామకం కావడంతో ఆ స్థానంలో వరలక్ష్మిని వీసీ కె.ప్రతాప్‌రెడ్డి సోమవారం ఖరారు చేశారని సమాచారం. రిజిస్ట్రార్ రామచంద్రం నేడు(మంగళవారం) ఉత్తర్వులు జారీచేయబోతున్నారు. మహిళా ప్రొఫెసర్లకు కూడా కీలక పదవులు ఇవ్వాలని మహిళా అధ్యాపకులు ఇటీవల వీసీకి వినతిపత్రం ఇచ్చారు. దీంతో వరలక్ష్మిని కీలక దూరవిద్యకేంద్రం డైరెక్టర్ పదవిలో నియమించేందుకు నిర్ణయించారు. యూనివర్సిటీ పీజీ కళాశాలకు మరో ప్రొఫెసర్‌ను నియమిస్తారని సమాచారం.

'ఆజంజాహీ' భూములపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

వరంగల్: ఆజంజాహీ మిల్లుకు చెందిన భూములపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ప్రస్తుత స్థలంలో కార్మిక భవనం నిర్మించి ఇవ్వాలని మావోయిస్టు పార్టీ జయశంకర్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపలి డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనవిడుదల చేశారు. వరంగల్‌లో ఏడు దశాబ్దాల క్రితం నిజాం కాలంలో స్థాపించిన ఆజంజాహీ వస్త్ర పరిశ్రమను దివాళా తీసేలా చేయడంతో పాటు 451 మంది కార్మికులకు బలవంతపు వీఆర్ఎస్ ఇచ్చి 2002లో మిల్లును మూసివేయడంతో కార్మికులు రోడ్డున పడ్డారని తెలిపారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం 'కుడా' సంస్థకు 117 ఎకరాల 20 గుంటలు, ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డుకు 65 ఎకరాలు, రాంకీ, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ సంస్థకు 30 ఎకరాల భూములు విక్రయించిందన్నారు. మిగతా భూములను కొద్ది మంది రాజకీయ నాయకులు, కార్మిక నాయకుల మద్దతుతో ఓం నమఃశివాయ, గొట్టిముక్కుల నరేందర్ లాంటి వారు కబ్జా చేశారని ఆరోపించారు. వరంగల్‌కు చెందిన సుద్దాల నాగరాజు అసంఘటిత కార్మిక సంఘం పేరుతో చలామణి అవుతూ సెటిల్‌మెంట్లు, భూ అక్రమాలకు పాల్పడి అక్రమంగా ఆస్తులు సంపాదించాడని ఆరోపించారు. మిల్లు భూముల వ్యవహారం ఇంకా కోర్టులో ఉన్నప్పటికీ నిబంధనలు పట్టించుకోకుండా హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్, వరంగల్‌కు చెందిన సుద్దాల నాగరాజు తప్పుడు పత్రాలు సృష్టించి ఓం నమఃశివాయకు అక్రమంగా అమ్ముకున్నారని, వీరి అండతో సదరు వ్యాపారి కార్మికుల కార్యాలయాన్ని అన్యాయంగా కూల్చేశాడని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం స్పందించి భూముల అమ్మకాన్ని వెంటనే నిలిపి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వెంకటేశ్ డిమాండ్ చేశారు.

అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ ఎత్తివేసే కుట్ర

- ఓసీ సంఘాల నాయకులు జైపాల్‌రెడ్డి, రామకృష్ణ ప్రసాద్, పాపారావు, సత్యమోహన్


మాట్లాడుతున్న ఓసీ సంఘాల నాయకులు

కాజీపేట అర్బన్ : అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ ఎత్తివేసే కుట్రతో హనుమకొండలో జరిగిన కుల సంఘాల సమావేశంలో కొందరు గిట్టని వ్యక్తులు ఓసీ ప్రజలను పరుషపదజాలంతో దూషించడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని ఓసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ పోస్టల్ కాలనీలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోట సురేశ్ అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో రాష్ట్ర రెడ్డి సంఘాల అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, రాష్ట్ర కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి గంగవరంపు రామకృష్ణ ప్రసాద్, వెలమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి పాపారావు, బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ సత్యమోహన్ మాట్లాడారు. అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ రద్దు చేయాలనడం రాజ్యాంగాన్ని అవమాన పరచడమేనన్నారు. ఓసీలోని నిరుపేదలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2019లో అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. సుప్రీం కోర్టు కూడా అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ కల్పించాలని తెలపడం ద్వారా ఎంతో మందికి లాభం చేకూరిందన్నారు. ఈ రిజర్వేషన్లను తట్టుకోలేక కొంత మంది తరచూ ప్రతి సభలో రెడ్డి, వెలమ, ఇతర సామాజిక వర్గాలను టార్గెట్ చేస్తూ సొంత భాషలో మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో జైహింద్‌రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, వెంకటరెడ్డి, గంగిడి ప్రభాకర్‌రెడ్డి, ఈసం రమణారెడ్డి, గొంది జగన్మోహన్‌రెడ్డి, కట్కూరి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టువీడని ప్రొఫెసర్లు..

- సీడీసీ డీన్ పదవి కోసం ఇద్దరూ తీవ్ర ప్రయత్నాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కీలక పదవి సీడీసీ డీన్ కోసం ఇద్దరు ప్రొఫెసర్లు పట్టు వీడడం లేదు. యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ఎకనామిక్స్ విభాగం అధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్, తెలుగు విభాగం ఇన్‌చార్జ్ విభాగం అధిపతి, కేయూ పాలకమండలి సభ్యుడు బి. సురేశ్‌లాల్ ఆశిస్తున్నారు. ఇద్దరు ఎవరికి వారు ఆ డీన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కేయూ పాలకమండలి సభ్యులుగా ఉన్న ప్రొఫెసర్లు వేరే కీలక పరిపాలన పదవులు నిర్వర్తించొద్దనే అంశం యూనివర్సిటీలో చర్చగా ఉంది. అయినా సురేశ్‌లాల్ తనకు ఆ పదవి కావాలని పట్టుపడుతుండడంతో వీసీ కె. ప్రతాప్‌రెడ్డి.. సురేశ్‌లాల్ వైపు మొగ్గుచూపుతున్నారు. పాలకమండలి సభ్యుడు కావడంతో వీసీ కాదనలేకపోతున్నారని యూనివర్సిటీలో చర్చగా ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ రామచంద్రం కొనసాగుతున్నారు. ఆయన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు. రిజిస్ట్రార్‌గా నియమితులై బాధ్యతలు కూడా చేపట్టడంతో ఆయన స్థానంలో సీడీసీ డీన్‌గా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తనకే అవకాశం ఇవ్వాలని ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ సమ్మయ్య ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేగాకుండా యూనివర్సిటీలో వివిధ విభాగాల ప్రొఫెసర్లకు పరిపాలన పదవులు ఇస్తున్నప్పటికీ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్లకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని సమాచారం. యూనివర్సిటీ పరిధిలో సీడీసీ డీన్ వివిధ కళాశాలలను పరిశీలించాల్సింటుంది. ఎక్కువ సైన్స్, ప్రొఫెషనల్ కోర్సులు, ల్యాబ్స్ కూడా ఉంటాయని అందుకే తనకే కేటాయించాలని కోరుతున్నారని సమాచారం. ఇప్పటికే నాలుగు పదవులు కలిగి ఉన్నవారికి మళ్లీ సీడీసీ పదవి ఇవ్వడం ఎంతవరకు సమంజసమనేది కూడా యూనివర్సిటీలో అధ్యాపకుల్లో చర్చగా ఉంది. దీంతో ఆ ఇద్దరిలో ఎవరిని నియమిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఒకటి రెండురోజుల్లో తేలిపోనుందని భావిస్తున్నారు.

పంటక్షేత్రాల్లో పసిప్రాయం..

- మిర్చితోటల్లో కూలీ పనులు చేస్తున్న బాలలు
- పట్టించుకోని ఐసీపీఎస్, ఐసీడీఎస్ అధికారులు


మిరపకాయలు ఏరుతున్న బాలబాలికలు

ఏటూరునాగారం: ఎన్ని చట్టాలు వచ్చినా.. ఎన్ని పథకాలు ఉన్నా బాలల జీవితాలు మారడం లేదు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ కొరవడంతో పుస్తకాలు పట్టుకుని పాఠశాలకు వెళ్లాల్సిన చిన్నారులు ఇప్పటికీ కొన్ని చోట్ల ఏదో పని చేస్తూనే ఉన్నారు. దీనికి నిదర్శనమే ఈ ఘటన. ములుగు జిల్లా ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో మిరప తోటలు సాగవుతున్నాయి. ఈ క్రమంలో మిరపకాయలు ఏరేందుకు పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ నుంచి 12 ఏళ్ల బాలబాలికలు వచ్చారు. అలాగే, ములుగు జిల్లా ఏజెన్సీ మండలాల్లో అటవీప్రాంతంలో నివాసముంటున్న గొత్తికోయగూడేల నుంచి బడీడు పిల్లలు మిర్చి కోతలకు వెళ్లడం గమనార్హం. బాలలను సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీం (ఐసీపీఎస్), ఐసీడీఎస్ అధికారుల తనిఖీలు, పర్యవేక్షణ పూర్తిగా కరువవ్వడంతో కొంత మంది ముఠాగా ఏర్పడి చిన్నారులను మిర్చి కోతలకు తరలిస్తున్నారు. దీంతో పసిమొగ్గల జీవితాలు ఏజెన్సీలోని మిర్చి తోటల్లో మసకబారిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి బడీడు పిల్లలను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి


పవన్ (ఫైల్)

టేకుమట్ల: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రాఘవాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామానికి చెందిన పంచిక పవన్(19) మిత్రులతో కలిసి మండల కేంద్రానికి వచ్చి మద్యం సేవించాడు. రాత్రి తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో రాఘవాపూర్ శివారులో చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి గట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి సుధాకర్ సోమవారం తెలిపారు.